# విచిత్ర గుప్తీయం

"ఇది విన్నారా ?"

"ఏది"

"విచిత్రగుప్త గారు బోర్డు తిప్పేశారట డబ్బులివ్వడం మానేశారట."

"అంటే దివాళా తీశారా?"

"ఐ.పీ. పెట్టారా?"

"అది కాదయ్యా బాబూ, విచిత్ర గుప్త గారి గురించి మీకు బొత్తిగా తెలిసినట్టు లేదే? మీరీ ఊరికి కొత్తా?

"అవును సార్, మేమీ ఊరికి ఈ మధ్యే వచ్చాం. సంగతేంటో చెప్పండి. మేం మా జాగ్రత్తలో ఉంటాం. దయచేసి ఈ సస్పెన్సుకి తెరదించండి."

"విచిత్రగుప్తగారు, ఈ మండలంలోనే ప్రఖ్యాతి గాంచిన వ్యక్తి. అందరికీ అప్పులిచ్చి ఆదుకున్న మహానుభావుడు."

"అప్పిచ్చేవాడు మహానుభావుడేంటయ్యా? అలాంటి వారు జలగలు. వడ్డీకి వడ్డీ లెక్కేసి జనాల రక్తం పీల్చే వాళ్ళు. అప్పు వసూలుకి ఆస్తులు జప్తు చేసే రకాలు. వారి గురించి గొప్పగా చెప్పడమేంటి?"

"వారి గురించి మీకేం తెలుసని ఇలా మాట్లాడుతున్నారు? తెలీక పోతే గమ్మునుండండి. అంతేగాని అవాకులు, చెవాకులుపేలకండి."

ఆ ఊరి రచ్చబండ బస్టాండులో అంత చలిలోను వాతావరణం వేడెక్కింది. ఆ ఊరి ప్రముఖ వ్యాపారవేత్త, సహనశీలి, సహృదయుడు శ్రీ విచిత్రగుప్తగారి గురించి చర్చ జరుగుతోంది. విచిత్రగుప్తగారు స్వశక్తితో పైకెదిగిన వారు. వ్యాపారమంటే ఆయన దృష్టిలో కేవలం అమ్మడం, కొనడం కాదు. ఆయన వ్యాపార పరిధి విశాలం. దేశ స్థూల ఉత్పత్తి పెంచడానికీ, ఉద్యోగ ఉపాధి కల్పనకూ, వివిధ ప్రాంతాల అభివృద్ధిలో సమతూకం సాధించడానికి పరిశ్రమలే పట్టుగొమ్మలని నమ్మిన ఆర్థికవేత్త. ఆ ఊరిలో కుటీర పరిశ్రమవాడను నెలకొల్పిన ఉద్యమశీలి. ఆయన కృషితో, చొరవతో ఆ ఊరి రూపురేఖలే మారిపోయాయి. ఉపాధి వేటలో పొరుగు రాష్ట్రాలకు వలసవెళ్ళే పరిస్థితి మారి, ఇప్పుడు పొరుగూర్ల నుండే కాక, ప్రక్క రాష్ట్రాల జనం కూడా ఉపాధి కొరకు ఆ ఊరు వచ్చే పరిస్థితి నెలకొంది. ఆ ఊరు చిన్న నగరంగా రూపుదాల్చింది. సర్వతోముఖాభివృద్ధికి మౌలిక సదుపాయాల ఏర్పాటు జరిగింది. ఇదంతా ఏ ప్రభుత్వ పథకాలతో, బ్యాంకు రుణాలతో, సాధ్యపడ్డాయనుకుంటే మీరు 'తప్పు'లో కాలేసినట్టే. కేవలం విచిత్రగుప్తగారి ముందుచూపు, ప్రణాళికాబద్ధ కార్యాచరణ, నిస్వార్థ దృక్పథం వల్లే, ఆ ఊరి పేరు రాష్ట్రమంతా మారుమ్రోగింది. తన సంపాదన, కేవలం తనకై ఆస్తులు కూడబెట్టే పరికరంగా గాకుండా, తోటివారికి అప్పులిచ్చి, వారుకూడా వ్యాపారాల్లో ఎదగడానికి తోడ్పడ్డారు విచిత్రగుప్తగారు. అలా ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించారు. ఆయన సహృదయంతో నిష్కల్మషంగా ఆయన ఇచ్చిన చేయూతో లేక ఆయన హస్తవాసో, ఆయన దగ్గర అప్పు పొందిన వారందరి వ్యాపారాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లాయి.

"పరిశ్రమ స్థాపనకు గుప్తగారు మూలధనం అప్పుగా ఇస్తే, అనతికాలంలోనే ఆ ఆసామి లక్షాధికారి కావడం ఖాయం" అనే నమ్మకం ప్రజల్లో ప్రబలింది. ఆయన బ్యాంకు కంటే కూడా తక్కువ వడ్డీ తీసుకోవడంతో జనాలకు చాలా సౌకర్యం కల్గింది. డిగ్రీ చదివి ప్రభుత్వోద్యోగం కొరకు అర్రులు చాచి, ఏజ్‌బార్ అయి నిరాశ చెందేకన్నా విచిత్రగుప్త గారి దగ్గర అప్పు తీసుకుని స్వయం ఉపాధిమార్గం చూసుకోవడమే మేలని చాలా మంది యువకులు కుటీర పరిశ్రమల స్థాపనకు నడుం కట్టారు. దాదాపు అయిదువందల పోర్షన్లతో, అన్ని మౌలిక వసతులతో ఓ పారిశ్రామిక భవనం కట్టించారు విచిత్రగుప్త గారు. అక్కడి ఉత్పత్తుల పంపిణీ వ్యవస్థ కూడా ఏర్పాటు చేశారు. అక్కడ తయారు కాని నిత్యావసర వస్తువులేదు. సబ్బులు, నూనెలు, పౌడర్లు,

క్రీమ్‌లు మొదలగు సౌందర్య సాధనాలు, ఖారా, చుడ్‌వా, జంతికలు, అప్పడాలు, పచ్చళ్ళు మొదలగు తినుబండారాలు, రెడీమేడ్ దుస్తులు, బనీన్లు, అండర్‌వేర్లు, సల్వార్ కుర్తాలు, బట్టలు మొ॥నవి, ప్లాస్టిక్ సామాన్లు, కంప్యూటర్లు, కాలిక్యులేటర్లు, రేడియోలు, టేపులు, డిజిటల్ ఫోటో ల్యాబ్‌లు, బ్యాగులు, పర్సులు, ఇలా ఒకటేమిటి సకల సామాన్ల తయారీకి ఆ ఊరు ఆలవాలం.

రోజువారీ అవసరాలు తీర్చే మేటి బహుళజాతి సంస్థల ఉత్పత్తులకు ఆ ఊళ్ళోనే కాదు, ఆ జిల్లాలోనే స్థానం లేకుండా పోయింది. చవక, నాణ్యమైన స్థానిక ఉత్పత్తుల ముందు వారి మార్కెటింగ్ జిమ్మిక్కులు ఉడకలేదు.

ఆ ఊరి వాణిజ్యాభివృద్ధి పరిగణించి రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ శాఖలు తెరిచాయి. అప్పులిస్తాం రమ్మని జనాలను ఊదరగొట్టాయి. క్లిష్టమైన అర్జీఫారాలు, అనుబంధంగా జత పర్చాల్సిన ఆదాయ, వ్యయ వివరాలు, ఆస్తుల జాబితాలు, వీటిని తయారు చేయడానికి చార్టెడ్ ఎకౌంటెంట్ల ఫీజులు, ఖాతా నిర్వహణ లోని కఠినమైన నిబంధనలు, ఇవన్నీ ఔత్సాహిక వ్యాపారులను బెంబేలెత్తించాయి. పరిశ్రమ స్థాపనకు కావలసిన రుణం మంజూరై డబ్బు విడుదల కావడానికి ఆర్నెల్ల దాకా ఆగవలసి వచ్చేది. ఈలోపున పుణ్యకాలం గడచి పోయి లోను వస్తుందనే ఆశతో తీసుకున్న చేబదుళ్ళ గడువు గడిచిపోయి, చాలామంది ఒత్తిళ్ళకు లోనయ్యారు. దినవారీ పెట్టుబడి కరువై యూనిట్లు మూతపడే స్థితి నెలకొంది. అలాంటి వారిని విచిత్రగుప్తగారే ఆపద్బంధువుగా ఆదుకున్నారు.

ఎదుటి వ్యక్తి పూర్వాపరాలు పరిశీలించి, అతను అప్పుకు అర్హుడోకాదో నిర్ధారించ డానికి రెండు రోజుల కంటే ఎక్కువ సమయం పట్టేదికాదు విచిత్రగుప్తగారికి. పారిశ్రామికులకు ఆయన అప్పివ్వడంతోనే సగం బరువు తగ్గినట్టయ్యేది. ముడి పదార్థాల సరఫరా, తయారు ఉత్పత్తుల వితరణ వ్యవస్థ ద్వారా అందరికి వెసులుబాటుగా ఉండేది.

గుప్తగారితో తాము పోటీపడలేమని బ్యాంకులు తమ చేతులెత్తేశాయి. విచిత్ర గుప్తగారు ఇవ్వడానికి ఇష్టపడని వ్యక్తిగత రుణాలపై మక్కువ పెంచుకున్నాయి. పెళ్ళిళ్ళకు, ఇళ్ళకు, వాహనాల కొనుగోలుకు, అవి విరివిగా అప్పులు ఇవ్వసాగాయి. ఆ అప్పులకు ఒకటే శరతు. వారు తమ వ్యాపారాలకు విచిత్రగుప్తగారి నుండి అప్పు తీసుకున్న వారై ఉండాలి.

విచిత్రగుప్తగారి దగ్గర అప్పు తీసుకున్నవారు దాన్ని సకాలంలో చెల్లిస్తే ఈ కథకు ఆస్కారమే లేదు. వారి హస్తవాసి మంచిదని ప్రచారమవడంతో పాటు, వారి అప్పు

తిరిగి చెల్లిస్తే, వ్యాపారం మళ్ళీ నష్టాల్లోకి పోతుందనే, ఇంకో నమ్మకం జనాల్లో ప్రబలింది. అప్పు తీర్చిన కొందరు అసాములు, తమ స్వానుభవంగా ఈ వదంతిని ప్రచారం చేశారు. అప్పుడు తాము, గుప్తగారి దగ్గర మళ్ళీ అప్పు చేసి తమ వ్యాపారాన్ని పునరుద్ధరించామని టాంటాం చేశారు. అప్పులు ఎగవేయడానికి సాకులు వెతికేవారికి ఊతం దొరికింది. చాలామంది వడ్డీ మాత్రం కడుతూ అసలు ఊసెత్తడం మానేశారు.

నెలనెలా వడ్డీ వచ్చినా, అసలు మాత్రం తిరిగి రాకపోవడంతో విచిత్రగుప్తగారి బొక్కసానికి గండిపడింది. దాంతో ఆయన ముగ్గురి కొడుకుల్లో ఆందోళన మొదలైంది. తమ తండ్రి ఇచ్చిన అప్పులు నిరర్థకంగా మారి, తమ ఆస్తులకు కూడా రెక్కలొస్తే తమ చేతికి చిప్పే గతి అని తండ్రితో మొరపెట్టుకున్నారు కొడుకులు. "కావాలంటే మీకూ అప్పు ఇస్తాను. మీ వ్యాపారాలు మీరే చేసుకోండి, అంతేగాని స్వార్జితమైన నా ఆస్తిపై ఆజమాయిషీ చేస్తామంటే కుదరదు" కట్టె విరిచారు వి.గు.గారు.

పర్యావసానంగా వారి కుటుంబంలో ఒకటికి నాలుగు కుంపట్లయ్యాయి. అందరూ ఒకే చూరుకింద ఉన్నా పోర్షన్లు వేరయ్యాయి. వ్యాపారాలు విడివడ్డాయి.

అలా అని వారి మధ్య ఆప్యాయతలు తగ్గలేదు. "వ్యాపారంలో బంధుత్వం, బంధుత్వంతో వ్యాపారం చొరబడ కూడదు" అనే సిద్ధాంతానికి కట్టుబడిన విచిత్ర గుప్తగారు దాన్ని తమ కుటుంబంలో అమలుపరిచారు.

అందుకే వేరుపడినా, అందరూ కలిసిమెలిసి ఉంటూ, పండగలు, పబ్బాలూ కలిసి చేసుకునేవారు.

అంతా సజావుగా సాగితే, లోకంలో ఇన్ని ఘర్షణలు, సంఘర్షణలు ఎందుకు? పరిమితికి మించి సాగదీస్తే తాడైనా రబ్బరైనా తెగి తీరుతుంది. వి.గు.గారి విషయంలో అదే జరిగింది.

ఇచ్చిన అప్పులు తిరిగిరాక పోవడంతో ఆయన భోషాణం బోసిపోయింది. 'అసలు కట్టకూడదు' అనే మనస్తత్వం తన ఖాతాదార్లలో పెరిగిపోవడం ఆయనను మరీ బాధపెట్టింది. గత్యంతరం లేక ఆయన బోర్డు తిప్పేశారు. అప్పివ్వడం మానేశారు. అదే ఆ ఊళ్ళో ఇంటింటి వార్తయింది. కాబోయే వ్యాపారస్తుల గుండెలో రాయిపడింది. మన తెలుగు చానెల్లకు "బ్రేకింగ్ న్యూస్" దొరికింది. ఆ ఊరి పరిస్థితులు కథనాలుగా ప్రసారింపబడ్డాయి. అప్పుతీసుకున్న వారితో ఇంటర్వ్యూలు, తిరిగి చెల్లించి నష్టపోయిన వారితో ముఖాముఖి, గుప్తగారి కొడుకులతో మాటా, మంతీ ఇలా ఆ ఊరి సంచలన వార్తలతో రాష్ట్రమంతా అట్టుడికిపోయింది. వి.గు.గారు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు మౌనంగా ఉన్నారు. తను పెదవి విప్పలేదు. పట్టు విడవలేదు.

ఈ సంఘటనల ప్రభావం అక్కడి పరిశ్రమలపై పడింది. ఉత్పత్తి కుంటుపడింది. ఇలా కొంతకాలం సాగితే, పరిశ్రమవాడకు తాళం వెయ్యాల్సి వస్తుందేమో అని అందరూ ఆందోళన చెందారు. విషయం ప్రభుత్వం దాకా వెళ్ళింది. పరిశ్రమల మంత్రి చొరవ తీసుకుని అక్కడి వ్యాపార ప్రతినిధులతో చర్చలు జరిపారు. విచిత్ర గుప్త గారితో మాట్లాడారు. ఖాతాదార్లందరూ తనిచ్చిన అప్పులు తీరుస్తేనేగాని తన లావాదేవీలు కొనసాగించనని ఖరాఖండిగా చెప్పారాయన. మొండి బకాయిదారులపై దావా వెయ్యడానికి ససేమిరా అన్నారు వి.గు.గారు. అలా దావాలు వేసి, తన డబ్బు, కక్షిదార్లసొమ్ము, కోర్టు సమయం వృధా చేయదలచుకోలేదన్నారాయన. వసూలు సిబ్బంది నియామకానికి కూడా 'నో' అన్నారు.

"ప్రజలు బద్దకం వీడాలనీ, మూసపద్ధతిలో ఉద్యోగాలకై పాకులాడకుండా యువత స్వయం ఉపాధి వైపు మరలాలనే మంచి ఉద్దేశ్యంతో నేను వారికి మూలధనం సమకూర్చాను. ప్రతిదానికీ ప్రభుత్వంపై ఆధారపడకుండా, ప్రజలే తమ బతుకుతెరువు మార్గం వెతుక్కోవాలని వారికి ఊతం ఇచ్చాను. కొందరు స్వార్ధపరులు అత్యాశతో నా అప్పు ఎగవేయడానికి పూనుకున్నారు. ఏవో వందతులు సృష్టించి నా డబ్బు నాకు తిరిగి రాకుండా చేశారు. నా పెట్టుబడి తిరిగి వస్తే ఇంకొంతమందికి చేయూత నీయగలను. నా మంచి తనాన్ని అలుసుగా తీసుకుని మోసం చేయడానికి ప్రయత్నించే వారిని క్షమించలేను. అందుకే నిజాయితీపరులకు నష్టం కల్గుతుందని తెలిసినా ఈ కఠిన చర్య తీసుకోక తప్పలేదు. నా సంపాదన పుట్టుకతో రాలేదు, పోయేప్పుడు వెంటరాదు. కాని నేను బతికుండగా నా ఆస్తితో సాధ్యమైనంతమందికి మేలు చేయాలనుకున్నాను. ఏ బలవంతంలేకుండా ఖాతాదార్లు అప్పుతీర్చేలా చేయండి. నాకు కావలసింది కేవలం నా అప్పు తిరిగి చెల్లింపుకాదు. "పరుల సొమ్ము పాము వంటిది" అనే నానుడి పై జనాలకు విశ్వాసం కలగాలి, వారిలో పరోపకారబుద్ధి పెరగాలి. నాలా వారూ ఇంకొకరికి చేయూతనీయాలి. ఎప్పటకైనా 'నిజాయితీదే గెలుపు' అనే భావన కలగాలి. అటువంటి పరివర్తన కలిగి నా అప్పులు తిరిగి చెల్లిస్తేనే నా కార్యకలాపాలు పునరుద్ధరిస్తాను". తన భావాలను తేటపరిచారు వి.గు. గారు.

అట్టి పరిస్థితులలో ఏదో మార్గం వెదకమని వ్యాపార బృంద ప్రతినిధులను కోరారు మంత్రిగారు. ఈ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం సహకరిస్తుందని ఆశ్వాసనం ఇచ్చారు.

వి.గు.గారి మనోభావాలను, మంత్రిగారి అభ్యర్దనను ఖాతాదార్ల బహిరంగ సభలో వెల్లడించారు వ్యాపార ప్రముఖులు. ఖాతాదార్లలో అంతర్మథనం మొదలైంది. వారిలో వారు చర్చించుకున్నారు. విషయ తీవ్రతను గమనించారు. తమ వైఖరితో మొదటికేమోసం వస్తుందనుకున్నారు. కట్టె విరగకుండా పామును చంపే పథకం తయారు చేశారు.

అప్పు మొత్తం తీర్చకుండా నామమాత్రం మొత్తం గుప్తగారి పేర తమ ఖాతాలో ఉంచుకుని మిగిలిన మొత్తం అప్పు తీర్చాలని వి.గు. గారి ఖాతాదార్లందరికి పిలుపు నిచ్చారు. తమ నమ్మకానికి స్వస్తి పలకకుండా వి.గు. గారిని తృప్తి పరిచే ప్రయత్నం చేశారు. చాలామంది అలా అప్పుతీర్చారు. అప్పుకు ఎగనామం పెట్టే ఉద్దేశ్యం ఉన్నవాళ్ళ ఇళ్ళముందు, వారి కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు చేశారు. 'గాంధిగిరి' ఉద్యమం ప్రేరితులై మొండివాళ్ళ మెడలు వంచారు.

తమ పరువు కాపాడుకోవడానికి వారూ దారికొచ్చారు.

చిత్రగుప్తుడి నేరస్థుల చిట్టాలా, విచిత్రగుప్తుని అప్పుదార్ల జాబితా పెరుగుతూనే ఉంది. కాని వారి భోషాణం తిరిగి తన కళను సంతరించుకుంది. వారి మొహంలో మళ్ళీ చిరునవ్వు మెరిసింది. వారి వ్యాపారాలు మళ్ళీ పట్టాలెక్కాయి. జనం ఊపిరిపీల్చు కున్నారు.

వి.గు. గారి బ్యాంకు ఖాతాలో జమ అయిన సొమ్ము వేయి ఎకరాల 'ప్రత్యేక ఆర్థిక మండలి' (స్పెషల్ ఎకనామిక్ జోన్) స్థాపించే స్థాయికి చేరింది. వి.గు.గారు తన యోచనకు ఆకారం ఇచ్చారు. వ్యవసాయ, బహుళ ఉత్పత్తుల ప్రత్యేక ఆర్థిక మండలి స్థాపనతో భారీ ఉపాధికల్పనకు నడుం కట్టారు. రాయితీ ధరతో భూమి ఇస్తానని ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇంకో 'సింగూర్' 'నందీగ్రామ్' సృష్టించకుండా ప్రభుత్వ భూమినిస్తే అభ్యంతరం లేదన్నారు గుప్తాగారు. అనతి కాలంలోనే ఆ పరిసరాల్లో సహకార పద్ధతిలో నడిపే వ్యవసాయ, బహుళ ఉత్పత్తుల ప్రత్యేక ఆర్థిక విభాగానికి ముఖ్యమంత్రి "భూమిపూజ" చేశారు.

దానికి మూలధనం విచిత్రగుప్తాగారే సమకూర్చారని వేరే చెప్పాలా?